

తగిన జాగ్రత్తలతో ఫాగింగ్ : కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: దోమల నియంత్రణకు ఫాగింగ్ చేసే సమయంలో తగిన జాగ్రత్తలతో పాటు మెళకువలు పాటించాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ సూచించారు. ఫాగింగ్ అంశంపై సోమవారం రాత్రి నగరపాలక కార్యాలయంలో డెమో కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్, జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసరావు ఫాగింగ్ విధానాన్ని పరిశీలించారు. ఫాగింగ్‌లో మెలాథిన్ ఎంత మోతాదులో వాడాలి, ఫాగింగ్ ఏ సమయంలో.. ఎక్కడెక్కడ చేయాలి అనే అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహ, మలేరియా విభాగం అధికారులు పాల్గొన్నారు.

పోరాట వారసత్వాన్ని కొనసాగిద్దాం

ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం



ఎస్పీడీసీఎల్ స్టోర్స్ ఎదుట సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సురేంద్ర, చైతన్య

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కార్మికహక్కుల కోసం పోరాట వారసత్వాన్ని కొనసాగించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చైతన్య, సురేంద్రన్ పిలుపునిచ్చారు. 53 సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం స్థానిక గ్రీన్‌పేటలోని ఎస్పీడీసీఎల్ స్టోర్స్ ఎదుట సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక హక్కుల కోసం ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో విద్యుత్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆరోగ్యదాస్, కార్మికులు పాల్గొన్నారు.

పలమనేరు: సిఐటియు ఆవిర్భావ దినోత్సవ వేడుకలను స్థానిక సిఐటియు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం సిఐటియు జెండాను మండల ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షకార్యదర్శులు గిరిధర్ గుప్తా, సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సిఐటియు ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు కార్మికుల పక్షాన ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం అలుపెరగని పోరాటం చేసి విజయాలు సాధించిందని గుర్తు చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత 44 చట్టాలను, నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక హక్కులను కాలరాయటం దుర్మార్గమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జయంతి, రాజా, జయచంద్ర, లక్ష్మయ్య, హైదర్ ఆలీ పాల్గొన్నారు.



పలమనేరులో సిఐటియు జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

దళితులపై కొనసాగుతున్న వివక్ష

- శ్రీరాముడి సాక్షిగా దళిత యువతులు, స్త్రీలపై దాడి
- అగ్రకులాలకు చెందిన యువకులపై కేసులు నమోదు చేయని పోలీసులు
- అండగా నిలిచిన కెవిపిఎస్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ దళితులకు ఆలయ ప్రవేశం లేదు. ఊరి చివర్లలో దళితుల నివాసాలు, ఉత్సవాలు ఊరేగింపులకు దూరం. ఆఖరికి చనిపోతే పూడ్చేందుకు శ్మశానాలు లేవు. అడుగడుగునా అవమానాలే... గుడిలోకి రానివ్వరు... ఉత్సవాల్లో పాల్గొనే అవకాశం లేదు... సరే అనుకుంటూ దళితులే ఉత్సవాలు నిర్వహించుకుంటే ఓర్వలేని అగ్రకులస్తులు అడ్డగింతలు.



పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న దళితులు

దళితులు ఉత్సవాలు నిర్వహించడమా..? డప్పులు, వాయిద్యాలతో ఊరేగింపులా అంటూ అడ్డుతగలడమే కాకుండా దళిత యువతులు, స్త్రీలపట్ల అభ్యంగా ప్రవర్తించిని అగ్ర కులాల వారిని అడ్డుకున్న దళిత యువకులు, స్త్రీలపై దాడి చేసిన సంఘటన చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో చిత్తూరు కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్ విజయ్ నగర్‌లో సోమవారం సాయత్రం చోటు చేసుకుంది.

దళిత యువతులు, స్త్రీలపై దాడిచేసి గాయపర్చడమే కాకుండా కులం పేరుతో నానాబూతులు తిట్టారు. శ్రీరామ నవమి ఊరేగింపు ఉత్సవాన్ని రసభసా చేయడమే కాకుండా ఉత్సవాన్ని అడ్డుకున్నారు. దీంతో దళితులు తాలూకా పోలీసులను ఆశ్రయిస్తే అగ్రకులస్తులు దాడి చేశారా.. చేసింద్వేరు... ఎందుకు చేశారు... అంటూ యక్షప్రశ్నలు వేయడమే కాకుండా దాడి సయంలో వీడియోలు తీశారా... సాక్షాలున్నాయా అంటూ న్యాయం కోసం దళితులనే పోలీసులు దోషులుగా చూస్తున్నారు. ఇదేమిటని బాధిత దళిత స్త్రీలు తాలూకా పోలీసులు తీరుపై ఆసహనం వ్యక్తం చేస్తూ పోలీస్ స్టేషన్ ఎదుటే పోలీసుల తీరుపై ఆందోళనకు పూనుకున్నారు. మా దళిత అమ్మాయిలను వెక్కిలి చేష్టలతో ఏడిపించిన అగ్రకుల యువకులను అడ్డుకుంటే మమల్ని కొట్టారు.. గాయాలు చూపించమంటే ఒంటిపై గాయాలను ఎలా చూపేదంటూ పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమపై దాడి చేసిన అగ్రకుల యువలకుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి న్యాయం చేయాలని కోరుతున్నారు.

అగ్రకుల యువకులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి..

వెక్కిలి చేష్టలతో దళిత యువతులను అమమాన పరచి అడ్డుకున్న దళిత స్త్రీలపై దాడులు చేసిన రెడ్డిగుంట అగ్రకుల యువకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా నాయకులు కె.సురేంద్రన్ డిమాండ్ చేశారు. బాధితులకు అండగా కెవిపిఎస్ ఉంటుందన్నారు. న్యాయం కోసం చిత్తూరు తాలూకా పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితులకు కెవిపిఎస్ నాయకులు సురేంద్ర అండగా నిలిచారు. బాధితులకు న్యాయం జరిగేలా డిఎస్‌పి, జిల్లా ఎస్పీల దృష్టికి తీసుకుపోనున్నట్లు చెప్పారు. ఈ సంఘటనను ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకున్నట్లు తెలిపారు.



బాధిత మహిళలతో మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా నాయకులు సురేంద్రన్

పేదల అభివృద్ధికే సంక్షేమ పథకాలు

మంత్రి పెద్దిరెడ్డి



జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి- సోమల: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నవరత్నాలు ద్వారా సంక్షేమ పథకాలను తీసుకువచ్చి పేదల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. జగనన్న సంతకానికి నాలుగు సంవత్సరాలు అన్న కార్యక్రమంలో భాగంగా సదుం మండలంలో ప్రజాప్రతినిధులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బూరగమంద క్రాస్ నుంచి సదుం బస్టాండ్ కూడలి వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీని ప్రారంభించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి చెప్పిన మాట తూచా తప్పకుండా సంక్షేమ పథకాల అమలు చేస్తున్నారని మేనిఫెస్టోలో ఇచ్చిన విధంగా పేదల అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. ఇవి ఏపీ పట్టని ప్రతిపక్షపార్టీ నేతలు ఆయనపై లేనిపోని విమర్శలు చేస్తున్నారని అన్నారు. అనంతరం బస్టాండ్ కూడలిలో కేక్‌కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. మండల కేంద్రమైన సోమలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జగనన్న సంతకానికి నాలుగేళ్లు కార్యక్రమంలో భాగంగా బైక్‌ర్యాలీ నిర్వహించి బస్టాండ్ కూడలిలో కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

2న జాబ్ మేళా

1500 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు



పోస్టర్లను విడదల చేస్తున్న కలెక్టర్ సగిలి షన్మోహన్, డిఆర్‌డిఎ పిడి తులసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

జూన్ 2న (శుక్రవారం) నిర్వహించే జాబ్ మేళా పోస్టర్స్‌ను జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జూన్ 2న (శుక్రవారం) ఉదయం 10గంటల నుండి పుత్తూరు మండలం, నారాయణవనం రోడ్డులో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించన్నుట్లు తెలిపారు. ఈ జాబ్‌మేళా పోస్టర్స్‌ను డిఆర్డీఏ పిడి తులసితో కలసి విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కువ మంది యువతకు ఉపాధి అవకాశాలు కలిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జాబ్ మేళాలో పదవ తరగతి పాస్, ఫెయిల్, ఇంటర్, ఐటిఐ, బి.ఫార్మ, యం.ఫార్మ, డిగ్రీ, ఎంబిఏ, ఎంసిఏ, బి.కామ్, ఎం.కామ్, బిఎస్‌సి, బిఈ, బిటెక్, ఎం.టెక్, ఎంఎస్‌సి కంప్యూటర్ సైన్స్ నుంచి పీజి వరకు ఉత్తీర్ణత అయిన యువతీ యువకులకు మెగా జాబ్‌మేళా పాల్గొనవచ్చునని తెలిపారు. ఈ జాబ్ మేళాలో వివిధ రంగాలకు చెందిన 15 బహుళ జాతీయ కంపెనీలలో దాదాపు 1500 ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహించబడునని తెలిపారు. వివరాల కోసం 63009 54441, 83744 21195, 81219 84014 నెంబర్లను సంప్రదించాలని జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ అధికారి ఎన్.గుణశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు సరితారెడ్డి, హర్ష పాల్గొన్నారు.

మలేరియా, డెంగీ లేని జిల్లాగా 'చిత్తూరు'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మలేరియా, డెంగీ నివారణకు సంబంధించి సంబంధితశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం స్థానిక జిల్లా కలెక్టర్ సమావేశం హాల్‌లో జిల్లా కలెక్టర్, ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్‌తో కలిసి జిల్లాలో సీజన్ వ్యాధులు, మలేరియా, డెంగీ వ్యాధుల నిర్మూలనపై జిల్లా మలేరియా అధికారి, జిల్లా వైద్య ఆరోగ్య, విద్య, జడ్పీ, అటవీ, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్, మెప్మా, డిఆర్డీఏ, ఐసిడిఎస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం మరియు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మలేరియా, డెంగీ కేసులు లేకుండా చూడాలని జిల్లా మలేరియా అధికారి వారిని ఆదేశించారు. జిల్లాలో మలేరియా, డెంగీ నిర్మాలనకు ఎలాంటి చర్యలు తీసుకుంతున్నారని జిల్లా మలేరియా అధికారిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మలేరియా, డెంగీ లేని జిల్లాగా చేయాలని, ప్రతి నియోజకవర్గంలో గ్రామ, వార్డు సచివాలయాల సెక్రటరీలకు మలేరియా, డెంగీ నిర్మూలన, సీజన్ వ్యాధుల పట్ల పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ప్రతి మున్సిపాలిటీలోనూ ఆర్టీసీ బస్టాండ్ లోనూ ప్రతిరోజు పాగింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అటవీ ప్రాంతంలో ఉన్న గ్రామాల ప్రజలకు వారికి మలేరియా, డెంగీ టెస్ట్ చేయించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వసతి గహాల్లో కూడా వారంవారం పాగింగ్ చేయించాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే బాలింతలు గర్భవతులకు వ్యాధులు నివారణకు తీసుకోవలసిన చర్యలు గురించి అంగన్వాడీ, ఆశ వర్కర్స్‌కు అవగాహన కలిగించాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. గ్రాణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న చెరువులను గుర్తించి అందులో 5 లక్షల చేపపిల్లను వదలడం జరుగుతుందని జిల్లా మత్స్యశాఖ డిడి కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్రీనివాసులు, జిల్లా వైద్య అధికారి డాక్టర్ ప్రకాశం, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ నాయక్, జిల్లా సాంఘిక సంక్షేమ,సాధికారత అధికారిణి డాక్టర్ రాజ్యలక్ష్మి, జిల్లా కార్మికశాఖ సహాయ కమిషనర్ ఓంకార్, గిరిజన సంక్షేమ సాధికారత అధికారి ఏ.మూర్తి, అటవీ, విద్య, ఆర్టీసీ, గ్రామీణ నీటిసరఫరా, మత్స్యశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధులపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సగిలి షన్మోహన్

జులై మొదటి వారంలో గృహ ప్రవేశాలు: కలెక్టర్



టిడ్కో ఇండ్ల నిర్మాణంపై సమీక్షిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: టిడ్కో గృహాలకు సంబంధించి పెండింగ్ పనులను జూన్ 30 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ సమావేశ హాల్‌లో జిల్లా కలెక్టర్, శిక్షణ కలెక్టర్ మేఘ స్వరూప్‌తో కలసి, చిత్తూరు, పలమనేరు, పుంగనూరు, నగరి, కుప్పం మునిసిపల్ కమిషనర్లు టిడ్కో ఈఈలతో టిడ్కో గృహాల నిర్మాణలకు సంబంధించిన పనులు, మౌలిక సదుపాయాలపై సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష, వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ టిడ్కో గృహాలను పూర్తిస్థాయిలో జూన్ నెలాఖరుకు పూర్తిచేయాలని, పనులు చేస్తున్న సంబంధిత కాంట్రాక్టర్లు పనులలో వేగంగా నాణ్యతతో కూడినా పనులను నిర్దేశించిన సమయానికి పూర్తిచేయాలని ఆదేశించారు. జులై మొదటి వారంలో సామూహిక గృహప్రవేశాలు నిర్వహించుటకు చర్యలు తీసుకోవాలన్నారు. గృహాల సముదాయంలో అప్రోచ్ రోడ్లు, నీటి వసతి, ప్రహరీ గోడల నిర్మాణం, త్వరితగతిగా పనులు పూర్తి చేయాలన్నారు. గృహా లబ్ధిదారులకు అవసరమైన వారికి మెప్మా అధికారులు బ్యాంకులతో మాట్లాడి రుణాలను ఇప్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు తరుచుగా వెళ్లి జరుగుతున్న పనులను పరిశీలించాలని అన్నారు. పలమనేరు మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, మెప్మా పీడీ రాధమ్మ, చిత్తూరు మున్సిపల్ కమిషనర్ అరుణ, టిడ్కో ఈఈ వెంకటముని, అధికారులు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు రూ.15.86 కోట్లు మంజూరు

మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం

డైయింగ్ యూనిట్లపై చర్యలు చేపట్టండి: కౌన్సిలర్లు

ప్రజాశక్తి- నగరి: తాగునీటి సరఫరాకు మంత్రి ఆర్కేరోజా చొరవతో రూ.15.86 కోట్లు నిధులు మంజూరైందని మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం తెలిపారు. మంగళవారం నగరి మున్సిపల్ కార్యాలయంలో ఆయన సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి సమావేశపు అజెండాను సభ్యులకు చదివి వినిపించారు. అజెండాలో ఏవైనా అభ్యంతరాలుంటే తెలపాలన్నారు. దీనిపై కౌన్సిలర్ దయానిధి మాట్లాడుతూ తాగునీరు శుద్ధీకరణను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. అలాగే జగనన్న కాలనీలో ప్రస్తుతం నీరు అందిస్తున్నారని మరో రెండు బోర్లు వేసి మరింత ఎక్కువగా నీరు అందిచాల్సిన అవసరముందన్నారు. దీనిపై మున్సిపల్ ఛైర్మన్ అధికారులతో చర్చించిన అనంతరం మాట్లాడుతూ అమత పథకంలో తాగునీటి సరఫరాకు రూ.15.86 కోట్లు మంజూరైందన్నారు. కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ నగరి శ్మశానంలో ఆకతాయిలు అపరిశుభ్రం చేస్తున్నారని ప్రహరీ నిర్మించి గేటువేసి వాచ్‌మెన్‌ను ఏర్పాటుచేయాలని కోరారు. కౌన్సిలర్ బీడీ భాస్కర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిరుపయోగంగా ఉన్న ఈటీపీని ప్రస్తుతం మంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపి నిర్వహణలోనికి తెచ్చారన్నారు. అయితే కొందరు డైయింగ్ యూనిట్ యజమానులు అధికారుల కన్నుగప్పి ఈటీపీకి రంగునీటిని తరలించక నదిలోను, కాలువలోను వదలిపెడుతున్నారన్నారు. వారిపై తప్పక చర్యలు చేపట్టి ఈటీపీకి రంగునీటిని తరలించేలా చూడాలన్నారు. దీనిపై మున్సిపల్ ఛైర్మన్ మాట్లాడుతూ కౌన్సిలర్లు, అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహిస్తామని ఈటీపీతో అనుసంధానం కాకుండా కాలువల్లోను, నదిలోను రంగునీరు వదలిపెట్టేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో వైస్‌ఛైర్మన్లు వెంకటరత్నం, బాలన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మేనేజర్ శేఖర్, టీపీవో నీరజాక్షి, మెప్మా అధికారి సునీత, ట్రాన్స్‌కో ఏఈ మోహన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ నీలమేఘం

వేగవంతంగా 'టిడ్కో' ఇండ్ల పనులు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కార్పొరేషన్ అధికారులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగర పరిధిలోని పూనేపల్లి వద్దనున్న టిడ్కో గృహ సముదాయాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు పనులను వేగవంతం చేయిస్తున్నామని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్‌కు వివరించారు. మంగళవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ నిర్వహించిన వీడియో సమావేశంలో కమిషనర్ నగరపాలక కార్యాలయం నుండి హాజరై మాట్లాడారు. టిడ్కో గహాలపై కలెక్టర్ సమీక్షించారు. నగరపాలక పరిధిలో టిడ్కో గహాల వద్ద జరుగుతున్న పనులను కమిషనర్ వివరించారు. జరుగుతున్న పనులను ప్రతి రెండు రోజులకు ఒకసారి తనిఖీలు చేస్తున్నట్లు వివరించారు. పనులు సకాలంలో పూర్తి చేసేలా గుత్తేదారులపై ఒత్తిడి చేస్తున్నట్లు చెప్పారు. పారిశుధ్య కార్మికులకు ప్రత్యేకంగా రుణాల మంజూరు, ఈఎస్ఐ సౌకర్యం వంటి అంశాలపై తీసుకున్న చర్యలను వివరించారు. వీడియో సమావేశం అనంతరం కమిషనర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. టిడ్కో గహ సముదాయాల వద్ద జరుగుతున్న పనుల పురోగతి, ఇతర అంశాలపై సమీక్షించారు. ఈకార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, సీఎంఎం గోపి, అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ప్రతినెలా మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మున్సిపాలిటీలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ప్రతినెలా మెడికల్ క్యాంపు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ సమావేశం హాల్‌లో ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్‌తో కలిసి డిసిహెచ్‌ఎస్, ఎల్డియం, మున్సిపల్ కమిషనర్లు, కార్మికశాఖ అధికారులతో మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు వైద్యపరీక్షలు, రుణాలు మంజూరు, కార్మికులకు కల్పించాల్సిన సదుపాయాలపై సమీక్ష, వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు మెడికల్ క్యాంపు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పారిశుధ్య కార్మికులకు ప్రతి క్వార్టర్ చివరి మాసంలో మెడికల్ క్యాంపు నిర్వహించి వారికి అవసరమైన వైద్య పరీక్షలు చేయించాలన్నారు. వైద్యపరీక్షలు సంబంధించి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, డిసిహెచ్‌ఎస్‌తో సమన్వయం చేసుకొని మెడికల్ క్యాంపు నిర్వహించి, పారిశుద్ధ కార్మికులకు వైద్యపరీక్షలు చేయాలన్నారు. జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న కార్మికులందరి పేర్లు, వారి ఆధార్ నెంబర్లు, వారి హోదా జాబితాను తయారు చేసి పూర్తి వివరాలను కలెక్టర్‌కి అందజేయాలని సంబంధిత మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల అర్హతను బట్టి బ్యాంకులు రుణాలు మంజూరు చేసే విధంగా బ్యాంకర్స్ తో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని, ఎల్డీఎంను ఆదేశించారు. అర్హత కలిగిన పారిశుధ్య కార్మికులకు జూన్ నెల చివరి వారంలో రుణమేళా నిర్వహించుటకు తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లకు ఆదేశించారు. దీనితో పాటుగా కార్మికులకు ఈఎస్ఐ, బీమా వంటి సదుపాయాలు కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎల్డియం శేషగిరిరావు, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ నాయక్, డాక్టర్ అరుణ్ కుమార్, పలమనేర్ మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, జిల్లా కార్మికశాఖ సహాయ కమిషనర్ ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 7న జాతీయ ఓబీసీ మహాసభ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఆగస్టునెల ఏడో తేదీన తిరుపతి నగరంలో జాతీయ ఓబిసి మహాసభ నిర్వహించనున్నట్లు బీసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు శ్రీనివాసులు గౌడ్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసిలకు చట్టసభలో జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ల గడస్తున్నా బీసిలకు అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. రాజకీయ రిజర్వేషన్ లేకపోవడంతో పార్లమెంటు, అసెంబ్లీలో బీసీలు ప్రజాప్రతినిధులుగా ఎన్నికకావడం లేదన్నారు. బీసీల హక్కుల కోసం ఉద్యమించనన్నుట్లు చెప్పారు. రాజ్యాధికారం దిశగా పోరాటాలను ముందుకు తీసుకుపోనున్నట్లు తెలిపారు. ఆగస్టు 7వ తిరుపతిలో నిర్వహించే జాతీయ మహాసభలకు రాజకీయ పార్టీల అధ్యక్షులతో పాటు ఇతర రాష్ట్రాల బీసి ముఖ్యమంత్రులు పాల్గొనున్నట్లు తెలిపారు. జగన్ ప్రభుత్వం కులగణన చేపట్టడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. బిజెపి పాలనలో బిసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని 50 శాతం చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఈసమావేశంలో జ్ఞానజగదీష్, సురేంద్ర, వినోద్‌కుమార్, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ భవన నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం



ప్రజాశక్తి-కుప్పం: చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలోని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆనాడు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి పేద వాడి కడుపు నింపడానికి అన్నా క్యాంటీన్ పేరుతో రూ.5 లకే భోజనాన్ని పేదవారికి అందించే బృహత్తర కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా చేపట్టారు. ప్రస్తుత అధికార పార్టీ వైసీపీ అధికారంలోకి రాగానే అన్నా క్యాంటీన్లను మూసివేయడంతో పలుచోట్ల అన్నా క్యాంటీన్లకు ఏర్పాటు చేసిన భవనాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. వాటిని తిరిగి వాడుకలోకి తీసుకొచ్చే కార్యక్రమంలో భాగంగా కుప్పంలో నూతన భవన నిర్మాణానికి మాజీ ముఖ్యమంత్రి నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకుడు బిఎంకె రవిచంద్రబాబు మొన్న జరిగిన మహానాడులో రూ.5 లక్షలను చంద్రబాబు నాయుడు సమక్షంలో ఆయన చేతికి అందించి ఆ డబ్బుతో కుప్పం నియోజకవర్గంలోని అన్నా క్యాంటీన్‌ను తిరిగి ఆధునికీకరణ చేసి పేదవారికి ఉచిత భోజనాన్ని అందించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా బిఎంకె రవిచంద్రబాబు మాట్లాడుతూ తన సొంత నిధులతో అన్నా క్యాంటీన్‌ను తిరిగి ప్రారంభిస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉందని, అన్నా క్యాంటీన్ మొదలుపెట్టి ఒక సంవత్సరం పూర్తి అవుతున్న తరుణంలో సంవత్సరం పాటు అన్నా క్యాంటీన్‌కు సహకరించిన దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సచివాలయాల తనిఖీ



ప్రజాశక్తి-సోమల: మండలంలోని మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలోని సచివాలయాన్ని, వల్లిగట్ల సచివాలయాన్ని తహశీల్దార్ శ్యాం ప్రసాద్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని, స్పందన అర్జీలను ఆన్‌లైన్ చేసి త్వరితగతిన ప్రజా సమస్యలను పరిష్కరించాలని సిబ్బందిని కోరారు. రికార్డులను, సిబ్బంది హాజరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ప్రకాష్, కార్యదర్శులు జయశంకర్, లోకేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం



ప్రజాశక్తి-సోమల: గ్రంథాలయాలతో విద్యార్థులకు విజ్ఞానం లభిస్తుందని గ్రంథాలయ అధికారి రామకృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా 'చదువంటే మాకు ఇష్టం' కార్యక్రమం కింద విద్యార్థులు పుస్తకాలను, పత్రికలను చదివారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పరిశీలన



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన విద్యా కానుకలో భాగంగా మండల పరిధిలోని 7692 మంది విద్యార్థులకు దుస్తులు, బ్యాగులు మంగళవారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చేరాయి. అనంతరం ఎంఈఓ సాయి లీల, ఐకేపీ ఏపీఎం, సీఆర్పీలు, ఉపాధ్యాయులు జగనన్న విద్యాకానుక బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించి డ్యామేజ్ ఉన్న బ్యాగులను గుర్తించేందుకు చర్యలు చేపట్టారు. ఎంఈఓ సాయిలీల మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన విద్యా కానుకలో భాగంగా ప్రతి ఒక్కరికీ నాణ్యమైన బ్యాగులు, దుస్తులు అందేలా చర్యలు చేపడుతున్నామని అక్కడికి వెళ్లిన ప్రజాశక్తి ప్రతినిధితో తెలియపరిచారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం, ఎంఈఓ సాయి లీల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్, ఉపాధ్యాయులు, సిఆర్పిలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు



ప్రజాశక్తి-నగరి: డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ కార్యకర్త, హెల్పర్ పోస్టులకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించగా 11 పోస్టులకు 19 మంది హాజరయ్యారు. నగరి మండలానికి సంబంధించి 5 పోస్టులకు 11 మంది హాజరు కాగా, నిండ్ర, విజయపురం, పాలసముద్రం మండలాల్లో ఒక్కో పోస్టుకు ఒక్కొక్కరి చొప్పున హాజరయ్యారు. కార్వేటినగరం మండలంలో 3 పోస్టులకు 5 గురు చొప్పున హాజరు కాగా వారిని ఆర్డీఓ సుజన, జిల్లా స్త్రీ, శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.నాగశైలజ, జిల్లా ఇమ్యూనిటీ అధికారి డాక్టర్ రవిరాజు, నగరి, కార్వేటినగరం, పిచ్చాటూరు సీడీపీవోలు కె.కృష్ణవేణి, ఎ.పద్మసునంద, పీజేడీ శోభారాణి ఇంటర్వ్యూ చేయగా కార్యాలయ సిబ్బంది కరుణాకర్ రెడ్డి, గిరిజమ్మ, సుకన్య, శ్రీహరి గోపి, పూర్ణచంద్ర, రామకృష్ణ నిర్వహణా బాధ్యతలు చేపట్టారు.

పేదల పక్షపాతి సీఎం జగన్

డిప్యూటీ సీఎం కుమార్తె కృపాలక్ష్మి


కార్వేటినగరం

ప్రజాశక్తి-కార్వేటినగరం: పేదరిక నిర్మూలనకు అహర్నిశలు కృషి చేస్తూ సంక్షేమ పథకాలతో ఆర్థిక సమానత్వాన్ని తీసుకొచ్చి పేదల పక్షపాతిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి నిలిచారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి అన్నారు. మంగళవారానికి వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గంగమాంబాపురంలో ఆ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కృపాలక్ష్మి మాట్లాడుతూ సీఎం జగనన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, మైనారిటీలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రత్యేక సంక్షేమ పథకాలను చేపట్టి పేదల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని గుర్తు చేశారు. పురుషులకు సమానంగా అన్ని రంగాల్లో మహిళలు రాణించేలా రిజర్వేషన్ కల్పించి మహిళా పక్షపాతిగా నిలుస్తున్నారని అన్నారు. ప్రతి మహిళ, బడుగు, బలహీన వర్గాల వారు సీఎంగా ఇంకా 30 సంవత్సరాల పాటు జగనన్ననే కొనసాగేలా చూడాలని, ప్రతి ఒక్కరూ జగనన్న ప్రభుత్వాన్ని ఆదరించాలని అన్నారు. అధికారం కోసం మోసపూరిత మేనిఫెస్టోలతో ఊదరగొడుతున్న చంద్రబాబు మాటలను నమ్మకండని, చంద్రబాబు అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలను మాయం చేస్తాడని పేర్కొన్నారు. పేదలు, ధనికులు సమాజంలో సమానంగా ఎదగాలంటే అది ఒక్క జగనన్నతోనే సాధ్యమని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. ఎంపీపీ లతబాలాజీ, మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు, సర్పంచ్ ధనంజయవర్మ, గోపి, పురంధర్, చందురాజు, శేఖర్‌రెడ్డి, మురగయ్య పాల్గొన్నారు.

రొంపిచెర్ల: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన చేపట్టి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రొంపిచెర్ల మండల కేంద్రంలో జడ్పిటిసి రెడ్డిశ్వర్ రెడ్డి, మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఇబ్రహీం ఖాన్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని, కేక్ కట్ చేసి పంచిపెట్టారు. వైస్ ఎంపీపీ విజయ శేఖర్ బాబు, వైసీపీ నాయకులు శ్రీనాథరెడ్డి, చిన్న నాగరాజు, లక్ష్మయ్య, శ్రీపతి, కరీముల్లా, శ్రీధర్ బాబు పాల్గొన్నారు.

చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు..!



ప్రజాశక్తి-రామకుప్పం: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడుపై అధికార పార్టీ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని టిడిపి మండలాధ్యక్షుడు ఆనంద రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి, మాజీ ఎంపీపీ ఆంజనేయ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగం కల్పించిన హక్కులతో ఉన్నతమైన పదవిలో ఉంటూ మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. కేంద్ర ప్రభుత్వం అసాధారణ భద్రత కల్పించడంలో భాగంగా జడ్ ప్లస్ కేటగిరి భద్రత కల్పిస్తే వైసీపీ నేతలు, పలువురు మంత్రులు రానున్న ఎన్నికల్లో తమకు ఓటమి ఖాయమనే బాధతో చంద్రబాబు నాయుడుపైన ఆవాకులు, చావాకులు పేల్చడం దిగజారుడు రాజకీయానికి నిదర్శనమన్నారు. వెంటనే రాష్ట్ర గవర్నర్ ఈ విషయంలో జోక్యం కల్పించుకుని తమ్మినేని సీతారాంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నర్సింహులు, గంట్లప్ప గౌడు, శ్రీనివాసులు రెడ్డి, వైస్ ఎంపీపీ చిన్ని కృష్ణ, సుబ్రీ, విజయ్‌కుమార్ రెడ్డి, సతీష్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

'తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు'



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: తెలుగుదేశం పార్టీ గెలిచి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే ఆంధ్ర రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా టీడీపీ యాదవ సాధికార కమిటీ అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నెల్లేపల్లి పంచాయతీకి చెందిన కొత్తూరు, అప్పిరెడ్డి కండిగలలో జిల్లా టీడీపీ యాదవ సాధికార కమిటీ ఆధ్వర్యంలో చంద్రబాబు ఫ్లెక్సీకి బిసి మహిళలు పాలాభిషేకం చేశారు. అనంతరం శ్రీధర్ యాదవ్ మాట్లాడుతూ మహానాడులో చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన ఎన్నికల మేనిఫెస్టోలో రాష్ట్రంలోని బడుగు, బలహీనవర్గాల అభివృద్ధితోపాటు వ్యవసాయం, ఉద్యోగం, విద్య, పేద కుటుంబాల్లో ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. చంద్రబాబు మేనిఫెస్టో ప్రకటించడంతో ప్రజలు సంపూర్ణ విశ్వాసంతో ఆయన మాటలను నమ్ముతున్నారన్నారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబు నాయుడుకి పట్టం కట్టడానికి బడుగు, బలహీన వర్గాలు, మహిళలు, రైతులు, ఉద్యోగ, వాణిజ్య వర్గాలు సిద్ధంగా ఉన్నట్లు, వైసీపీతో ఇప్పటికే ప్రజలు విసిగి పోయారన్నారు. నేతలు వెంకటేష్ యాదవ్, భీమయ్య బోయడు, గణపతి, నాగరాజు, సుబ్బరాయులు, నిర్మల, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఉపాధి, వాటర్ షెడ్ పనులు అయినవారికేనా?

మండల మీట్‌లో ప్రశ్నించిన ఎంపిటిసి సావిత్రమ్మ



ప్రజాశక్తి-సోమల: మండలంలో ఉపాధి హామీ, వాటర్ షెడ్ పనులు అయిన వారికే కేటాయిస్తూ, పనులు చేయకపోయినా బిల్లులు పాస్ చేస్తూ నిధులు స్వాహా చేస్తున్నారంటూ మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ సావిత్రమ్మ గట్టిగా ప్రశ్నించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయ సమీపాన ఉన్న సమావేశ మందిరంలో మధ్యాహ్నం రెండు గంటలకు సోమల మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ ఈశ్వరయ్య అధ్యక్షతన ప్రారంభించారు. 213 మంది రైతులకు పిఎం కిసాన్ కొత్తగా ఈకేవైసీ చేయించుకున్న వారికి, ఈ పంట నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే లబ్ధి అందే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు వ్యవసాయ అధికారి సుధాకర్ తెలిపారు. ట్రాన్స్‌కో ఏఈ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ కంచం వారి పల్లి, పేటూరు గ్రామాల వద్ద రెండు నూతన సబ్ స్టేషన్ల నిర్మాణానికి అనుమతులు వచ్చాయని, లో వోల్టేజీ సమస్య తొలగించేందుకు సబ్ స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కొత్తగా రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు అవసరమైన వారు తమ సిబ్బందిని సంప్రదిస్తే సాధ్యమైనంత త్వరలో మంజూరు చేస్తారని తెలిపారు. ఎం వడ్డీ పల్లె గ్రామంలో ఇండ్ల మధ్యనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న కారణంగా పిల్లలు విద్యుత్ షాక్‌కు గురయ్యే అవకాశం ఉందని ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి మార్చాలని ఎంపీటీసీ నాగభూషణం రెడ్డి ట్రాన్స్‌కో ఏఈని కోరారు. పెద్ద ఉప్పరపల్లి వైద్యాధికారిని రమ్యశ్రీ మాట్లాడుతూ జూన్ 5 నుంచి 7వ తేదీ వరకు ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు డయేరియా వ్యాధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పొదలకుంటపల్లి ఎంపీటీసీ నాగభూషణం రెడ్డి ప్రతి శాఖ తమ నివేదికలు చదివి వినిపించిన తర్వాత ఆ శాఖ లోని సమస్యలను ప్రజలకు ఆ శాఖ ద్వారా తెలియజేయాల్సిన సమాచారాన్ని గురించి ప్రశ్నించారు. ఇతర ఎంపీటీసీలు సర్పంచులు ఎవరు కానీ నోరు మెదిపిన పాపాన పోలేదు. మండల కేంద్రమైన సోమల ఎంపీడీవో కార్యాలయ సమీప సమావేశ మందిరంలో మధ్యాహ్నం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు సర్పంచులు ఎంపీటీసీలు అధికారులు హాజరు కావాల్సి ఉండగా వీరితో పాటు పలువురు అనధికార వ్యక్తులు సమావేశంలో వచ్చి కూర్చోవడం అధికారులను సమస్యలపై ప్రశ్నించడం కనిపించింది. దీంతో ఇది మండల సర్వసభ్య సమావేశమా లేక బహిరంగ సభా అన్న అనుమానం తలెత్తింది. అడ్డు చెప్పాల్సిన అధికారులు మిన్నకుండిపోయారు. కార్యక్రమంలో కందూరు వైద్యాధికారిణి విజయలక్ష్మి, పిఆర్ ఏఈ ఆనంద్, తహశీల్దార్ శ్యాం ప్రసాద్ రెడ్డి, ఎంపీడీవో నాగరాజు, జడ్పిటిసి కుసుమ కుమారి, వైస్ ఎంపీపీ ప్రభాకర్, సహకార సంఘం చైర్మన్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నడివీధి గంగమ్మ జాతర


కార్వేటినగరం

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండల పరిధిలోని గంగమాంబాపురం చెరువులో వెలిసిన శ్రీనడివీధి గంగమ్మ జాతర మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ప్రీతికరమైన అంబు గ్రామంలో నుంచి ట్రాక్టర్లతో ఆలయానికి చేరుకుని అమ్మవారిని అంబళ్లతో అభిషేకించారు. ఆలయ ఆవరణంలో మహిళలు పెద్ద ఎత్తున పొంగళ్లు వండి పిండి దీపాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ వీధులను వేపాకు తోరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని పట్టువస్త్ర, సుగంధ భరిత, పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి గ్రామ వీధుల్లో కేరళ వాయిద్యాలు, తమిళనాడు నుంచి గరగటం, వివి వాయిద్యాలు, బాణసంచాలు పేలుస్తూ అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. గంగమాంబాపురం గ్రామంలో జరుగుతున్న గంగజాతరను పురస్కరించుకుని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి కుమార్తె కె.కపాలక్ష్మి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు పట్టాభిరెడ్డి, హరిరెడ్డి, డిల్లీరెడ్డి, గ్రామస్తులు డిప్యూటీ సీఎం కుమార్తె కపాలక్ష్మికి శాలువాలు కప్పి గజమాలతో సత్కరించి స్వాగతం పలికారు. ఆమె వెంట ఎంపీపీ లతబాలాజీ, మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు, సర్పంచ్‌లు ధనంజయవర్మ, శేఖర్‌రెడ్డి, సర్వేశ్వర్, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్ రెడ్డి, నాయకులు ఉన్నారు.

బంగారుపాళ్యం: మండలంలోని మొగిలి, వెంకటగిరి, తగువారిపల్లి, ఆర్‌ఆర్ నగర్ గ్రామాల్లో మంగళవారం గంగమ్మ జాతర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు ఉదయం అంబళ్లు, సాయంత్రం పొంగళ్ళు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వి.కోట: మండల కేంద్రమైన వి.కోటలో వెలిసిన పెద్దపులి గంగమ్మ జాతర సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కార్తికేయ ఆధ్వర్యంలో దేవాలయాన్ని సుందరంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. పట్టణ ప్రధాన కూడళ్లలో అమ్మవారి విద్యుత్ కటౌట్లు విశేషంగా భక్తులను అలరించాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రి గంగమ్మ శిరస్సును సుందరంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. అమ్మవారి శిరస్సు దేవాలయ ప్రాంగనంలో ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో ప్రవేశించి భక్తులకు నిజరూపదర్శనం కల్పించారు. మంగళవారం ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి ఆలయ ప్రాంగణంలో పొంగలి పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, పట్టణ ప్రజలు, యువత పాల్గొన్నారు.


వి.కోట

మంత్రి పెద్దిరెడ్డి పర్యటన



ప్రజాశక్తి-రొంపిచెర్ల: అటవీ, విద్యుత్ ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రొంపిచెర్ల మండలం బాలనాగిరెడ్డిగారి పల్లెలో మంగళవారం పర్యటించారు. బుధవారం వివాహం జరగనున్న పొన్నంరెడ్డి కృష్ణా రెడ్డి కుమార్తె దీపిక రెడ్డి వివాహం సందర్భంగా ఆమెను ఆశీర్వదించి వస్త్రాలు అందజేశారు. అనంతరం కొంతసేపు గ్రామస్తులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి రెడ్డిశ్వర్ రెడ్డి, రొంపిచెర్ల సర్పంచ్ ఇబ్రహీం ఖాన్, వైస్ ఎంపీపీ విజయ్ శేఖర్ బాబు, వైసీపీ నాయకులు శ్రీధర్, చిన్న నాగరాజ, లక్ష్మయ్య, శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.

మహాకుంభాభిషేక వేడుకల్లో వైసీపీ నేత



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండల పరిధిలోని ఆత్మకూరు పంచాయతీకి చెందిన రాసిన రెడ్డి పల్లెలో నూతనంగా నిర్మించిన సంపద వినాయక కాళికాదేవి మహా కుంభాభిషేక వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో వైసీపీ నేత నూకతోటి రాజేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామస్తులు గణేష్ బాబు, మహిమై దాసులు ఆలయ మర్యాదల ప్రకారం సాంప్రదాయ రీతిలో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు నూక తోటి రాజేష్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు కామసాని మునిరెడ్డి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

2న మండల మీట్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండల సర్వసభ్య సమావేశం జూన్ 2వ తేదీన ఉదయం 10 గంటలకు ఎంపీపీ అనిత అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ, సర్పంచులు, అధికారులు తప్పకుండా పాల్గొనాలని ఆమె కోరారు.

గంగమ్మ జాతర్లకు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సారె

ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతి రూరల్ మండలం పద్మావతీ పురం, వేదాంతపురం పంచాయతీ వినాయక నగర్, పెరుమాళ్ల పల్లి పంచాయతీ చందమామ పల్లి గ్రామాల్లో మంగళవారం జరిగిన గంగమ్మ జాతర్లలో చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సందడి చేశారు. తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి పట్టు వస్త్రాలు తీసుకు వెళ్లి జాతర జరిగే గ్రామాల్లో గంగమ్మకు సమర్పించారు. గంగమ్మ తల్లికి సారె తీసుకు వెళ్లిన మోహిత్ రెడ్డిని గ్రామ పెద్దలు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మోహిత్ రెడ్డి స్థానికులతో కలిసి సరదాగా కొంత సేపు అమ్మవారి ఆలయాల వద్ద గడిపారు.

నేడు సైన్స్ సెంటర్లో ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతిలోని స్థానిక ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం వారి ఆధ్వర్యంలో జీన్ హెల్త్ కనెక్షన్ అనే అంశంపై కొత్త మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్ మే 31వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తున్నట్లు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కె. శ్రీనివాస నెహ్రూ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్ విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ టెక్నాలజికల్ మ్యూజియం, బెంగళూరు, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ, హైదరాబాద్, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్, మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, భారత ప్రభుత్వం వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ ఎగ్జిబిషన్లో 20 వర్కింగ్ మోడల్స్ జన్యు, ఆరోగ్యం మధ్య ఉన్న సంబంధం వివరిస్తుందని చెప్పారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.రాజారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిస్తారని వివరించారు. ఈ ఎగ్జిబిషన్లో పాల్గొనాలనే ఆసక్తి కలిగిన తిరుపతి పుర ప్రజలు, ప్రముఖులు, ఆధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన వచ్చని సూచించారు.

ఆగస్టు 12, 13 తేదీల్లో వ్యకాసం జిల్లా మహాసభలు

పజాశక్తి-తిరుపతి సిటి : ఆగస్టు 12, 13 తేదీల్లో జరగనున్న వ్యవసాయ కార్మిక సంగం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి చిన్నం పెంచలయ్య పిలుపునిచ్చారు. ముఖ్య కార్యకర్తల సమావేశం బైరాగిపట్టెడలోని కార్యాలయంలో మంగళవారం జరిగింది. సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, వ్యకాసం జిల్లా కార్యదర్శి సిహెచ్ ప్రభాకర్ పాల్గొన్నారు.

కంకర వేశారు.. తారు మరిచారు..!

ఇబ్బందుల్లో ప్రజలు



ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని కంచిరెడ్లపల్లి– చౌడిరెడ్డిపల్లి వెళ్లే గ్రామాలకు ఆరు నెలల క్రితం రోడ్ల మరమ్మతులకు కంకర తోలి పనులు పూర్తి చేయకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతు న్నట్లు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామాలకు వెళ్లే దారులు పలమనేరు నుంచి దండపల్లి మీదుగా శంకర రావుపేటకు వెళ్లే రహదారి నుంచి సుమారు ఒకటిన్నర కిలోమీటర్లు దూరం ఉంటుందని ఈ నేపథ్యంలో కంకర తోలి తారు వేయకుండా వదిలి వేయడంతో కనీసం నడవడానికి కూడా వీల్లేకుండా పోతుందని, ద్విచక్ర వాహనాలు అయితే పూర్తిగా వెళ్లలేవని, ఈ గ్రామాల నుంచి రైతులు మార్కెట్‌కు తాము పండించే కూరగాయలు చేరవేయడానికి నరకం అనుభవిస్తున్నామని, సంబంధిత అధికారులు స్పందించి వెంటనే ఈ రోడ్డు పనులు పూర్తి చేస్తే బాగుంటుందని గ్రామస్తులు కోరుతున్నారు.

దారి సమస్యకు పరిష్కారం



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని తీర్థం గ్రామపంచాయతీ పరిధిలోని వెంకటస్వామి, నాగరాజు, సుబ్రహ్మణ్యం అనే ముగ్గురు రైతులు దారి సమస్యకు ఘర్షణలు పడుతున్న విషయం తెలుసుకున్న గ్రామ రెవెన్యూ అధికారి గోపాలకష్ణ, పార్టీలకు అతీతంగా గ్రామస్తులు సోమవారం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం గ్రామ రెవెన్యూ అధికారి గోపాలకృష్ణ సమక్షంలో ముగ్గురు రైతులను ఒప్పించి పక్క పొలాల రైతుల భూముల వద్దకు వెళ్లేలా ఒక్కొక్కరు 4 అడుగుల చొప్పున దారికి వదిలేలా గ్రామస్తులు ఒప్పించారు. అనంతరం సచివాలయ సర్వేయర్ హరిని పిలిపించి సర్వే చేయించి గ్రామస్తుల సమక్షంలో రాళ్లు నాటించి తీర్థం పంచాయతీ పరిధిలో రైతుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద రాజన్న, ఎంపిటిసి తనయుడు కేశవులు, పాఠశాల ఛైర్మన్, టిడిపి నాయకుడు గోవిందస్వామి, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా చేయరాదు



ప్రజాశక్తి-విజయపురం: మండలంలో క్షురికాపురం పంచాయతీ మహావీరపురం గ్రామంలో తాగునీటితో వస్త్రాలను ఉతుకుతూ నీటిని వృధా చేస్తున్నట్లు, అలాగే వాటిని రోడ్లపైనే ఉతకడంతో నీరు వీధుల్లో నిలిచి పారిశుధ్యానికి దారి తీసి జబ్బులు వచ్చే అవకాశాలున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇలా చేసే వారిపై చరయలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు బగళనత్తంలో 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలోని బందార్లపల్లి పంచాయతీ బగళనత్తం గ్రామంలో గడపగడపకు మ న ప్రభుత్వ కార్యక్రమం బుధవారం నిర్వహించను న్నట్లు వైసీపీ మండల అధ్యక్షుడు బాబు రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, జడ్పీటీసీ నితిన్, ఎంపీడీఓ రాధాకష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ భరత్ పాల్గొని ప్రతి ఇంటికీ వెళ్లి వారి సమస్యలపై పరిష్కార చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా గ్రామంలోని ప్రజలు తమ సమస్యలు, ప్రభు త్వ పథకాలు, ఇతర సమస్యలపై ఎమ్మెల్సీ దష్టికి తీసు కువచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. కార్యక్రమా నికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైసిపి కార్యకర్తలు, ప్రభుత్వ వివిధ శాఖ అధికారులు తప్పనిసరిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పశువుల అమ్మకాలపై మొగ్గుచూపుతున్న రైతులు



ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని పరిసర ప్రాంతాల్లో ప్రైవేట్ పాల డైరీలు ఎక్కువగా ఉండటంతో ఎక్కువ శాతం మంది రైతులు పశువుల పెంపకంపై ఆధారపడి పాలు పిండి డెయిరీలకు వేసి జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో గానుగపిండి 50 కేజీల విలువ రూ.2.5 వేలు, రూ.1250 పెరిగిపోవడంతో ప్రస్తుతం 10 లీటర్లు పిండకానికి తగ్గితే గిట్టుబాటు ధర కావడం లేదని అంటున్నారు. దీంతోపాటు ప్రైవేటు డెయిరీల వారు గతంలో పాల బిల్లులు రైతుల సొంత ఖాతాలోకి జమ చేసే వార ని, ప్రస్తుతం గ్రామాలలో పాలు కొలిచే డీలర్ల ఖాతాలోకి వేయడం తో వారు సకాలంలో రైతులకు చెల్లించకపోవడం కాక, డెయిరీలో ఇస్తున్న ధరలకంటే తక్కువ ధరలకు బిల్లులు వేస్తున్నారని అందుకే ప్రస్తుతం రైతులు పశువు ఈనడానికి సిద్ధంగా ఉన్న సమయంలో అమ్మి వేయడం జరుగుతుందని, గతంలో రూ.45 వేల నుంచి 50 వేల ధర ఉన్న పశువు ప్రస్తుతం పంటకు వస్తే రూ.80 వేల నుంచి 90 వేలకు అమ్ముడుపోతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సంవత్సరం పొడవునా పాలు, పిండి అమ్మగా కనీస మందులు సగభాగం కూడా డబ్బులు రాకపోవడమే కాక పని భారం కూడా పెరుగుతుందని అందుకే ప్రస్తుతం పాడి రైతులు పశువుల అమ్మకాలపై ఉన్నారని గ్రామాల్లో ఎక్కువ శాతం మంది ఇదే మార్గాన్ని ఎంచుకుంటున్నారని రైతులంటున్నారు.